సాక్షి
బాపట్ల
శుక్రవారం । 29 । మార్చి । 2024



వైభవంగా తిరునాళ్ల
శావల్యాపురం: పొట్లూరు శివారులో ఉన్న శ్రీలక్ష్మి తిరుపతమ్మ సమేత గోపయ్యల తిరునాళ్లను గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు.



మహంకాళి అమ్మవారి తిరునాళ్ల
నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలో మహంకాళి అమ్మవారి ఆలయ వార్షిక మహోత్సవాన్ని గురువారం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్ర)	సహరి (శని)
బాపట్ల	6.25	4.48
నరసరావుపేట	6.27	4.50
గుంటూరు	6.25	4.48

న్యూస్‌రీల్

ఏఎస్‌ఐ, కానిస్టేబుల్ బదిలీ

సాక్షి ఎఫెక్ట్

మంగళగిరి: ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న ఏఎస్‌ఐ ఏడుకొండలు, ఎస్బీ కానిస్టేబుల్ శ్రీనివాసరావులను ఉన్నతాధికారులు బదిలీ చేశారు. 'ఏఎస్‌ఐ పనితీరు వివాదాస్పదం' అనే శీర్షికన ఈనెల 27వ తేదీ సాక్షిలో ప్రచురితమైన కథనంపై స్పందించిన ఉన్నతాధికారులు ఏఎస్‌ఐ, ఎస్బీ కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకున్నారు. వీరు టీడీపీకి అనుకూలంగా పనిచేస్తున్నారంటూ వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టిన అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక అందిజేశారు. ఉన్నతాధికారులు వెంటనే ఏఎస్‌ఐ ఏడుకొండలును హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. పట్టణ ఎస్బీ కానిస్టేబుల్ శ్రీనివాసరావును గుంటూరు కార్యాలయానికి బదిలీ చేశారు. ఎన్నికల విధులలో ఏకపక్షంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఉన్నతాధికారులు హెచ్చరించారు.

హాస్పిటల్స్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

గుంటూరుమెడికల్: జిల్లాలో ప్రైవేట్ క్లినిక్‌లు, నర్సింగ్ హోమ్‌లు, డెంటల్ క్లినిక్, ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు తప్పనిసరిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి కార్యాలయంలో రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయించుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. రిజిస్ట్రేషన్ లేదా రెన్యువల్ లేకుండా ఆసుపత్రిలో వైద్య సేవలు, కార్యకలాపాలు నిర్వహించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

మత్స్యావతారంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు



మంగళగిరి: మంగళగిరి నగరంలోని లక్ష్మీ నృసింహ స్వామి ఆస్థాన అలంకారోత్సవంలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు స్వామి వారు శ్రీదేవి భూదేవి సమేతుడై మత్స్యావతారంలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి ఉత్సవాన్ని పర్యవేక్షించారు. కైంకర్యపరులుగా హైదరాబాద్‌కు చెందిన దూర్జటి మధుసూదనరావు, చెంచు వెంకటసుబ్బారావులు వ్యవహరించగా ఆస్థాన కైంకర్యపరులుగా మంగళగిరికి చెందిన ఇనుమన మిక్లారి శ్రీరామచంద్రశర్మ, కృష్ణవేణి దంపతులు వ్యవహరించారు.

అమరేశ్వరుని సేవలో ఉత్తరాఖండ్ స్వామీజీలు



అమరావతి: ప్రసిద్ధ శైవక్షేత్రమైన అమరావతి అమరేశ్వరస్వామిని గురువారం పలువురు పీఠాధిపతులు దర్శించారు. తొలుత ఉత్తరాఖండ్ జ్యోతిర్మర్ పీఠాధిపతి, శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ మెంబర్ స్వామి వాసుదేవానంద సరస్వతీజీ మహారాజ్, శ్రీపీఠాధిపతి బ్రహ్మానంద సరస్వతీజీ మహరాజ్, ఉత్తరాఖండ్ నాంతాస్ బాబా ఆశ్రమం శంకర్‌దేవ్‌జీమహారాజ్, సాధుసందర్శన సమితి జాతీయ అధ్యక్షులు భారతీస్వామిలకు ఆలయ మర్యాదలలో ఈవో వేమూరి గోపీనాథశర్మ, అర్చకులు, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామిజీ అమరేశ్వరునికి, బాలచాముండేశ్వరీ అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వెంకటాద్రినాయుని మండపంలో స్వామిజీలు భక్తులను ఆశీర్వదించి అనుగ్రహభాషణం చేశారు. ఆలయ అర్చకులు స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను స్వామిజీలకు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

యార్డులో 1,12,869 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,03,020 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,12,869 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.20,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 21,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది.

ఎన్నికల వ్యవస్థ పరిరక్షకులు

ఎన్నికల ప్రక్రియలో కీలకం కానున్న అధికారులు

- పార్లమెంట్ నియోజకవర్గానికి ఆర్వోగా కలెక్టర్
- ఎన్నికల ప్రక్రియలో బీఎల్వో, ప్రిసైడింగ్ అధికారులూ ముఖ్యమే
- ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు, ఆర్డీఓ జి.సూర్యనారాయణరెడ్డి

చీరాల: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. నోటిఫికేషన్ నుంచి కౌంటింగ్ పూర్తయి ఫలితాలు వెలువడే వరకు రిటర్నింగ్ అధికారులే కీలక పాత్ర పోషిస్తారు. వీరితో పాటు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల బాధ్యతా ఎక్కువగా ఉంటుంది. ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా, అభ్యర్థులు కోడ్ అతిక్రమించకుండా పర్యవేక్షించేందుకు ఎన్నికల కమిషన్ వీరికి ప్రత్యేక అధికారాలను అందించింది. ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణం కల్పించడం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, అభ్యర్థుల నామినేషన్ పత్రాలు దాఖలు, పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు బూత్ లెవల్ అధికారుల నుంచి జిల్లా ఎన్నికల అధికారుల వరకు ప్రత్యేక బాధ్యతలు నిర్వర్తిస్తారు. జిల్లాలో ఉన్న ఆరు నియోజకవర్గాలలో ఒక్కో నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారిని నియమించారు. రాష్ట్రంలో ఎన్నికల హడావుడి ప్రారంభమైన తరుణంలో వాటి నిర్వహణలో అధికారులు నిర్వర్తించే బాధ్యతలను ఒక్కసారి తెలుసుకుందాం.

- **జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్**

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా జిల్లా ప్రధాన ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. జిల్లా వ్యాప్తంగా ప్రవర్తనా నియమావళిని అమలు చేస్తూ ఎన్నికలు ప్రశాంతంగా జరిపించడంలో కీలకపాత్ర పోషిస్తారు.

- **రిటర్నింగ్ అధికారి (ఆర్వో)**

ప్రతి నియోజకవర్గానికి ఒక రిటర్నింగ్ అధికారిని ఎన్నికల సంఘం నియమిస్తుంది. నోటిఫికేషన్ వెలువడనప్పటి నుంచి ఫలితాలు ప్రకటించే వరకు రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల బాధ్యత ఎక్కువగా ఉంటుంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, అభ్యర్థుల ఖర్చు, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, తిరస్కరణ, ఉపసంహరణ, పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ, బ్యాలెట్ పేపర్ల తయారీ, కౌంటింగ్ వంటి కీలకమైన బాధ్యతలు రిటర్నింగ్ అధికారుల సమక్షంలోనే జరుగుతుంది. సహాయ రిటర్నింగ్ అధికారి సహకారంతో నియోజకవర్గ ఎన్నికల ప్రక్రియకు వీరే పూర్తి బాధ్యత వహిస్తారు.

- **అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్వోలు)**

నియోజకవర్గ స్థాయిలో ఆర్వోలకు సహాయాధికారులుగా స్థానిక తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు ఏఆర్వోలుగా వ్యవహరిస్తారు. ఆర్వో చేపట్టే బాధ్యతల్ని వీరు సమన్వయంతో నిర్వహిస్తారు.

- **సెక్టోరియల్ అధికారి**

ఎనిమిది నుంచి పది పోలింగ్ కేంద్రాల్ని పర్యవేక్షించేందుకు ఒక్కో సెక్టోరియల్ అధికారిని నియమిస్తారు. మండలంలో వివిధ శాఖల్లో పనిచేసే గెజిటెడ్ అధికారులకు ఈ బాధ్యతల్ని అప్పగిస్తారు. చీరాల నియోజకవర్గంలో 22 మందిని సెక్టోరియ్ అధికారుల్ని నియమించారు. వీరికి పోలీసు సిబ్బంది, వీడియోగ్రాఫర్‌ను కూడా కేటాయించారు. ఆయా పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూస్తారు. అవసరమైన చోట 144 సెక్షన్‌ను విధించే అధికారం ఉంటుంది. సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ కేంద్రాలలో చేపట్టాల్సిన బందోబస్తును సిఫారసు చేయడం వంటి విధులు నిర్వహిస్తారు.

- **ప్రిసైడింగ్ అధికారి**

ప్రతి పోలింగ్ బూత్‌కు ఒక ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. ఆయన ఈవీఎంలు, వీవీ ప్యాడ్‌లను పోలింగ్ కేంద్రానికి తీసుకువస్తారు. పోలింగ్ అనంతరం సీల్ వేసి స్ట్రాంగ్ రూంకు తరలిస్తారు. ఇతనికి మరో అధికారి ఏపీవో ఉంటారు. పోలింగ్ కేంద్రాలలో జరిగే అన్ని కార్యకలాపాలు ఈయన పర్యవేక్షణలోనే జరుగుతాయి.

ఆర్వోకి అన్ని విధాలా సహాయం చేస్తూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తారు. జిల్లావ్యాప్తంగా ఆరు నియోజకవర్గాలకు ఆర్వోలను నియమించారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు

నియోజకవర్గానికి రెండు లేదా నాలుగు చొప్పున ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఉంటాయి. ఆ బృందాలు ఆయా మండలాల్లో మద్యం, డబ్బు, ఓటర్లను ప్రలోభ పరిచేందుకు తరలించే సామగ్రి అక్రమ రవాణా జరగకుండా విస్తృతంగా తనిఖీలు చేపడతారు. నియోజకవర్గంలో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఎంఎస్, వీవీటీ టీంలను ఏర్పాటు చేశారు. ఎన్నికల తీరును నివేదికగా రూపొందించి జిల్లా, రాష్ట్ర ఎన్నికల అధికారులకు పంపడంలో మైక్రో అబ్జర్వర్లు కీలకంగా వ్యవహరిస్తారు. ఎన్నికల ప్రక్రియలో చిట్టచివరి సిబ్బందే బూత్ లెవల్ స్థాయి అధికారి. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, దరఖాస్తులు వీరే పర్యవేక్షిస్తారు. అర్హులైన పౌరుల పేర్లు ఓటరు జాబితాలో ఉండేలా విధులు నిర్వర్తిస్తారు. ఓటరు నమోదు, జాబితా తయారీలో అధికారులకు తోడ్పాటు అందిస్తారు.

ఏర్పాట్లు అన్నీ పూర్తి చేస్తున్నాం



చీరాలలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తిచేసేలా అన్నీ ఏర్పాట్లు, చర్యలు తీసుకున్నాం. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విధిగా నిబంధనలు పాటిస్తూ పోలింగ్ బూత్‌ల్లో సౌకర్యాలు కల్పించాం. సమస్యాత్మక గ్రామాలు, వార్డులపై నిత్యం నిఘా ఉంచాం. సెక్టోరియల్ అధికారులకు కేటాయించిన విధులను పర్యవేక్షిస్తున్నాం. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు కూడా సహకరించాలి. ఓటున్న ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఎన్నికల నిబంధనలు, నియమావళిని తూచా తప్పకుండా పాటిస్తాం.

– జి.సూర్యనారాయణరెడ్డి, నియోజకవర్గ ఎన్నికల అధికారి చీరాల

ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడితే సహించం

– ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లాలోని నిజాంపట్నం నుంచి చీరాల మండల పరిధిలోని రాయల్ మెరైన్ కంపెనీ రొయ్యల కంటైనర్‌లో అక్రమంగా తరలించిన రూ. 56 లక్షలను సీజ్ చేశామన్నారు. గురువారం ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రొయ్యల ముసుగులో అక్రమాలకు పాల్పడుతున్నారనే సమాచారం రావడంతో ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి వాహనాన్ని వెంబడించి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. రొయ్యల కంటైనర్లు సీల్ ప్యాకింగ్‌తో రావడంతో చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు నిర్వహించడం కష్టంగా ఉందని, ముస్ముందు ప్రతి వాహనాన్ని తనిఖీచేసే విధంగా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రాయల్ మెరైన్‌కు చేరుకున్న కంటైనర్‌ను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఆధ్వర్యంలో ఓపెన్ చేశామని చెప్పారు. తనిఖీల అనంతరం రూ. 56 లక్షలను సీజ్ చేయడంతోపాటు 102 సీఆర్‌పీసీ కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ కేసు ఆర్థిక లావాదేవీలకు ముడిపడి ఉండటంతో సమగ్ర విచారణ కోసం ఇన్‌కంట్యాక్స్ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

రేపు గుంటూరు రానున్న ఈవీఎంలు

నెహ్రూనగర్: ఎన్నికల సంఘం గుంటూరు నగర పాలక సంస్థకు కేటాయించిన ఈవీఎంల్లో కొన్నింటిని గతేడాది పల్నాడు, బాపట్ల జిల్లాలకు ఇచ్చామని, ప్రస్తుతం అవసరమున్నందున వాటిని తిరిగి ఆయా జిల్లా అధికారులు శనివారం అందించనున్నారని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) కీర్తి చేకూరి గురువారం పేర్కొన్నారు. గత ఏడాది మేలో గుంటూరు నగరపాలక సంస్థకు ఎన్నికల సంఘం కేటాయించిన ఈవీఎంల్లో 100 పర్చూరు మండలానికి అక్కడ జెడ్పీటీసీ ఎన్నికల అవసరాల కోసం పంపామని తెలిపారు. వారికి ప్రస్తుతం అవసరం లేనందున వాటిని తిరిగి గుంటూరు పంపుతున్నారని ఆమె తెలిపారు.

దొంగ దొరికాడు !

ఎన్నికలవేళ టీడీపీ తాయిలాలు

- ఆ పార్టీ పొన్నూరు అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర ఫొటో స్టిక్కర్లతో ఉన్న 567 సైకిళ్లు స్వాధీనం చేసుకున్న అధికారులు
- ఓటర్లకు పంపిణీ చేసేందుకు ఆయన స్వగ్రామం చింతలపూడిలో దాచినట్టు సమాచారం అందించిన స్థానికులు





పంపిణీ చేసేందుకు టీడీపీ సిద్ధం చేసిన సైకిళ్లు,(ఇన్‌సెట్‌లో) సైకిళ్లపై అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర స్టిక్కర్లు ఉన్న దృశ్యం

పొన్నూరు: పొన్నూరు నియోజకవర్గంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసి, తాయిలాల ఎరవేసి ఓట్లు దక్కించుకునేందుకు టీడీపీ పన్నాగం పన్నింది. విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేసి తల్లిదండ్రుల మెప్పుపొందేందుకు భారీ సంఖ్యలో కొనుగోలు చేసింది. టీడీపీ అభ్యర్థి ధూళిపాళ్ల స్వగ్రామం చింతలపూడిలోని ఓ రైస్‌మిల్లులో నిల్వ చేశారు. సమాచారం అందుకున్న ఎన్నికల అధికారులు వాటిని సీజ్ చేశారు. శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు పొన్నూరు నియోజకవర్గం ఎన్నికల అధికారులకు ఫోన్ చేశారు. మండలంలోని చింతలపూడి గ్రామంలోని ఓ రైస్‌మిల్‌లో టీడీపీ నేత, ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర ఫొటో, సైకిల్ గుర్తుతో ఉన్న నూతన సైకిళ్లు వందల సంఖ్యలో ఉన్నాయని సమాచారం అందింది. వెంటనే అధికారులు హుటాహుటిన రైస్‌మిల్‌కు చేరుకుని వందల సంఖ్యలో ఉన్న సైకిళ్లను చూసి అవాక్కయ్యారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ రంగు, గుర్తులు, అభ్యర్థి ఫొటో ఉండటంతో అన్ని సైకిళ్లను సీజ్ చేశారు. సంఘటనా స్థలానికి ఓ వ్యక్తి చేరుకుని తాను కోర్టు ద్వారా ఆక్షన్‌లో సైకిళ్లను దక్కించుకున్నానని, అధికారులకు తెలిపాడు. అయితే, ఎన్నికల నియమావళికి వ్యతిరేకంగా సైకిళ్లు ఉన్నాయని, ఒకేచోట పార్టీ సింబల్స్‌తో ఇన్ని ఉండరాదని తేల్చి చెప్పారు. కోడ్ ఉల్లంఘించిన కారణంగా 567 సైకిళ్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి వరదరాజులు, ఏంపీడీవో రత్నజ్యోతి తెలిపారు. ధూళిపాళ్ల నరేంద్ర ఎన్నికల తాయిలాల పంపకంతోనే విజయం సాధించే ప్రక్రియకు ఎన్నికల అధికారులు అడ్డుకట్ట వేశారు.

అంతర రాష్ట్ర సరిహద్దులో పటిష్ట నిఘా

- రెండు తెలుగు రాష్ట్రాల కలెక్టర్లు, ఎస్పీలు నిర్ణయం
- సమావేశానికి హాజరైన పోలీసు అధికారులు
- అక్రమ నగదు, మద్యం, ఇతర వస్తువుల రవాణాకు చెక్



మాట్లాడుతున్న పల్నాడు కలెక్టర్, ఎస్పీ, వేదికపై నల్గొండ, సూర్యాపేట జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు

నరసరావుపేట: అంతర్ రాష్ట్ర, జిల్లా సరిహద్దు ప్రాంతాల మీదుగా ఎన్నికల నిబంధనలు అతిక్రమించి చట్టవ్యతిరేకంగా అక్రమ నగదు, మద్యం, ఇతర వస్తువులు రవాణా జరగకుండా నిరంతర నిఘా ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని రెండు తెలుగు రాష్ట్రాల కలెక్టర్లు, ఎస్పీలు నిర్ణయించారు. రెండు రాష్ట్రాల్లో ఒకేసారి జరగనున్న అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో గురువారం నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి వద్దనున్న ఇండియన్ సిమెంట్స్ సమావేశ మందిరంలో సరిహద్దు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు అధికారులు సమావేశమయ్యారు. పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డిలు మాట్లాడుతూ పల్నాడు జిల్లా సరిహద్దులోగల సూర్యాపేట, నల్గొండ జిల్లాలకు రాకపోకలు సాగించే రహదారుల వెంబడి పోలీసు శాఖకు సంబంధించి తొమ్మిది చెక్‌పోస్టులు, ఎక్సైజ్ శాఖకు చెందిన రెండు చెక్‌పోస్టులు, అటవీ, రవాణా శాఖలకు చెందిన ఒక్కొక్క చెక్‌పోస్టుల వద్ద ముమ్మర వాహన తనిఖీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. నిరంతరం వాహన తనిఖీలు చేపట్టే విధంగా తగినంతమంది సిబ్బందిని నియమించటం జరుగుతుందన్నారు. సమావేశంలో సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు, ఎస్పీ బీజే రాహుల్ హెగ్డే, నల్గొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, ఎస్పీ చందన దీప్తి, పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాదు, జిల్లా అటవీశాఖ అధికారి ఎన్. రామచంద్రరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజామొహిద్దీన్, గురజాల డీఎస్పీ పల్లపురాజు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక సదుపాయాలు

- అధికారులకు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశం
- పోలింగ్ రోజు ఏర్పాట్లపై పలు సూచనలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

బాపట్ల: పోలింగ్ రోజు దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. దివ్యాంగులు, వృద్ధ ఓటర్లకు ప్రత్యేక సదుపాయాలు కల్పించే అంశంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం గురువారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో దివ్యాంగులు, వృద్ధ ఓటర్లకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా చెప్పారు. జిల్లాలో 14,525 మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నారని, 85 సంవత్సరాలు దాటిన వృద్ధ ఓటర్లు 8,633 మంది ఉన్నారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వారీగా మ్యాపింగ్ చేయాలని అధికారుల్ని ఆయన ఆదేశించారు. అన్ని నియోజకవర్గాలలో ఆదర్శ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. నియోజకవర్గాలు, పోలింగ్ కేంద్రాల వారీగా వీల్ చైర్స్ ఏర్పాటుపై ఆర్ఓల నుంచి నివేదిక తెప్పించుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ తప్పనిసరిగా ర్యాంప్‌లు ఏర్పాటు చేయాలని చెప్పారు. దివ్యాంగులు పోలింగ్ కేంద్రాలకు వచ్చేలా వాహనాలు ఏర్పాటు చేయాలని, వారి కోసం ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సులభతరంగా ఓటు వేసేలా స్నేహపూర్వక వాతావరణం కల్పించాల్సిన ప్రాథమిక బాధ్యత అధికారులపై ఉందని ఆయన స్పష్టం చేశారు. నూతనంగా వీరి కోసం హోమ్ ఓటింగ్ విధానాన్ని ఎన్నికల కమిషన్ నూతనంగా ప్రవేశపెట్టిందన్నారు. తొలుత 'సక్షం యాప్' లో పేర్లు ముందస్తుగా నమోదు చేసుకునే అవకాశం ఎన్నికల కమిషన్ కల్పించిందని తెలిపారు. హోమ్ ఓటింగ్‌పై ఆరు నియోజకవర్గాలలో అధికారులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఈ అవకాశాన్ని వృద్ధులు, దివ్యాంగులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, పీడబ్ల్యూడీ ఓటర్ల నోడల్ అధికారి గుణశీల, డీఈవో నారాయణరావు, డీఆర్డీఏ పీడీ వై.పిచ్చిరెడ్డి, బాపట్ల మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తీర ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

ఎమ్మెల్యే కోన



అడవిపల్లిపాలెంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: తీర ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బాపట్ల మండలంలోని పాండురంగాపురం,అడవిపల్లిపాలెం గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. తీరప్రాంత ప్రజలు ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజలు, తమకు అందిన సాయాన్ని ఎమ్మెల్యే కోనకు వివరించారు. తీర ప్రాంతంలో దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. తామంతా మీ వెంటే అంటూ కోనతోపాటు నడిచారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ కొక్కిలిగడ్డ చెంచయ్య, నాయకులు గోసుల కోదండం, చేజర్ల నారాయణరెడ్డి, వడ్డిముక్కల డేవిడ్, గవిని కృష్ణమూర్తి,నర్రావుల వెంకట్రావు, మోర్ల సముద్రాలగౌడ్, గంగిశెట్టి రత్తయ్య పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా 'విన్నకోట'



విన్నకోట సత్యప్రసాద్‌ను అభినందిస్తున్న సభ్యులు

బాపట్ల: స్థానిక జిల్లా కోర్టు బార్ అసోసియేషన్‌కు 2024 –25 సంవత్సరానికి జరిగిన ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎన్నికలలో అధ్యక్షుడిగా విన్నకోట సత్యప్రసాద్ 43 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. నాలుగుసార్లు అధ్యక్షుడిగా ఎన్నికైన సత్యప్రసాద్‌ను గురువారం సభ్యులు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యక్షురాలిగా జి.ఎస్.ఎస్. మోహిని, జనరల్ సెక్రటరీగా ఎల్. సాంబయ్య, జాయింట్ సెక్రటరీగా కె. కొర్నేలియా, కోశాధికారిగా ఏ.టి. నటరాజన్, లైబ్రరీ సెక్రెటరీగా ఈ. ప్రేమ్‌చంద్, మహిళా ప్రతినిధిగా కత్తి నాగలక్ష్మి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా బెజ్జం వెంకటేశ్వర్లు, ఉప ఎన్నికల అధికారిగా ఏ. మాధవి, జి. కిశోర్ వ్యవహరించారు. నూతన కార్యవర్గానికి బార్ అసోసియేషన్ సభ్యులు, పట్టణ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

క్లుప్తంగా

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

- 18 మంది అరెస్టు
- రూ.2.21 లక్షలు స్వాధీనం

పర్చూరు (చినగంజాం): పర్చూరు పరిధిలోని ఓ పేకాట శిబిరంపై బాపట్ల పోలీసులు మెరుపు దాడి చేశారు. జిల్లా పోలీసు కార్యాలయానికి అందిన రహస్య సమాచారంతో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ, రూరల్ ఎస్ఐ శ్రీహరి ఆధ్వర్యంలో గురువారం వేకువజామున సుమారు 20 మంది పోలీసులు మండలంలోని వీరన్నపాలెం గ్రామ శివారు పొలాల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేశారు. 18 మందిని అరెస్టు చేయడంతో పాటు వారి వద్ద నుంచి రూ.2.21 లక్షలతో పాటు తొమ్మిది ద్విచక్ర వాహనాలు, 18 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దాడి అనంతరం వారిని పర్చూరు పోలీసు స్టేషన్‌కు అప్పగించారు.

దేవదాయ శాఖ ఈవో సస్పెన్షన్

చీరాల: సత్రానికి సంబంధించిన నగదును సొంతానికి వాడుకున్న దేవదాయ శాఖ ఈవోను అధికారులు సస్పెండ్ చేశారు. కనక నాగవరపమ్మ అమ్మవారి దేవస్థానం ఈవో జి.వి.ఎల్.కుమార్ చీరాలలోని దేవదాయ శాఖ సత్రం అధికారిగా పని చేస్తున్నారు. కొన్ని నెలల కిందట సత్రానికి సంబంధించిన బ్యాంకు అకౌంట్‌లో ఉన్న రూ.32 లక్షలను ఎవరికి చెప్పకుండా డ్రా చేసుకున్నాడు. విషయం తెలిసిన కమిటీ సభ్యులు ఇటీవల దేవదాయ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రాథమికంగా విచారణ చేపట్టిన అధికారులు, దేవదాయ శాఖ డెప్యూటీ కమిషనర్ ఇచ్చిన నివేదిక మేరకు కమిషనర్ గురువారం ఈవో కుమార్‌ను సస్పెండ్ చేశారు. అనంతరం విచారణ కమిటీని నియమిస్తారని డెప్యూటీ కమిషనర్ తెలిపారు.

నేడు అండర్-20 బాలుర ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న మధ్యాహ్నం 3 గంటలకు సత్తెనపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో అండర్-20 బాలుర ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు జరుగుతాయని పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యేశ్వరరావు గురువారం తెలిపారు. 2005-07 మధ్య జన్మించిన క్రీడాకారులు ఎంపికలకు అర్హులన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు జనన ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు వెంట తీసుకురావాలన్నారు.

ముస్లింల అభ్యున్నతికి సీఎం జగన్ ప్రత్యేక కృషి

నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ



విందులో వడ్డిస్తున్న బాలాజీ

యద్దనపూడి: ముస్లింల అభ్యున్నతికి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విశేషంగా కృషి చేశారని పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ అన్నారు. యద్దనపూడిలో వైఎస్సార్ సీపీ నాయకుడు రావూరి వేణుబాబు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తొలుత స్థానిక మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా, ముస్లిం మత పెద్దలు ఆయన్ను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని రంగాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముస్లింలకు సముచితస్థానం కల్పించిందని తెలిపారు. పాదయాత్రలో ముస్లిం సమస్యలను తెలుసుకున్న ఆయన అధికారంలోకి రాగానే వారికి అండగా నిలిచారన్నారు. ఉప ముఖ్యమంత్రి పదవితో పాటు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లుగా అవకాశం కల్పించారని గుర్తు చేశారు. ఉర్దూకు రాష్ట్రంలో రెండో అధికారిక భాష హోదా కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. అనంతరం ఇఫ్తార్ విందులో భాగంగా ముస్లింలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు చుండి లక్ష్మీనారాయణమ్మ, మండల కన్వీనర్ షేక్ శ్రీనివాసరావు, మార్టూరు మండల కన్వీనర్ పఠాన్ కాలేషావలి, వక్ఫ్ బోర్డు సెక్రటరీ గద్దం మస్తాన్ వలి, దుగ్గినేని కోటేశ్వరరావు, జేసీఎస్ మండల కన్వీనర్ ధూళిపాళ్ల వేణు, రాంబాబు, గనిపిశెట్టి వెంకట్రావు, దొడ్డ బ్రహ్మం, బండారుపల్లి రాంబాబు, కోడూరి నాగరాజు, తనుబుద్ధి వీరారెడ్డి, మార్టూరు, యద్దనపూడి మండలాల ముస్లింలు పాల్గొన్నారు.

రూ. 9.50 లక్షలు జప్తు



తాడికొండ: మండల పరిధిలోని కొర్రపాడు చెక్‌పోస్టు వద్ద గురువారం అనధికారికంగా తరలిస్తున్న రూ. 9.50 లక్షలను మేడికొండూరు సీఐ దార్ల జయకుమార్ స్వాధీనం చేసుకున్నారు. సత్తెనపల్లికి చెందిన గంగూరి రామచంద్రరావు కారులో గుంటూరు నుంచి సత్తెనపల్లి వెళుతున్న సమయంలో కొర్రపాడు చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్న సమయంలో రూ. 9.50 లక్షలను పోలీసులు గమనించారు. సదరు వ్యక్తిని వివరాలు చెప్పమని ప్రశ్నించారు. సరైన సమాధానం చెప్పకపోవడంతో నగదు సీజ్ చేసినట్లు సీఐ జయకుమార్ తెలిపారు.

నాజ్ సెంటరులో రూ. 2.66 లక్షలు

పట్నంబజారు: గుంటూరు నాజ్‌సెంటర్‌లో గురువారం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో రైలుపేటకు చెందిన తాతా ఉదయ భాస్కర్‌రావు, అమ్మిశెట్టి మల్లికార్జునరావు వద్ద రూ. 2,66,800లు గుర్తించారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సీఎం జగన్ పాలనలో సామాజిక న్యాయానికి పెద్దపీట

- నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్
- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడితో కలసి ఎన్నికల ప్రచారం
- గ్రామాల్లో బ్రహ్మరథం పట్టిన అభిమానులు, కార్యకర్తలు



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అనిల్ కుమార్, ఎమ్మెల్యే బొల్లా

శావల్యాపురం: సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో కలిసి శావల్యాపురం మండలంలోని కారుమంచి, మతుకుమల్లి, శానంపూడి, బొందిలిపాలెం, ముండ్రువారిపాలెం గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారు. అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే బ్రహ్మనాయుడులకు గ్రామాల్లో అపూర్వ స్వాగతం పలికారు.

ఇచ్చిన హామీలు అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదే ..

ఇచ్చిన మాట ప్రకారం 2019 నుంచి 2024 వరకు సంక్షేమ పథకాల రూపంలో రూ.2.75 లక్షల కోట్ల రూపాయలను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసి, హామీలన్నీ అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఆరు వందల హామీలు ఇచ్చి అమలు చేయలేకపోయారని విమర్శించారు. ఫించను కోసం ఎదురు చూసే ప్రభుత్వం కావాలో, ఇంటికి వచ్చి ఫించను ఇచ్చే ప్రభుత్వం కావాలో ఆలోచన చెయ్యాలన్నారు. చంద్రబాబు ఒంటరిగా గెలవలేక జనసేన, బీజేపీ పార్టీలతో పొత్తు పెట్టుకొని మరోమారు ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యాడని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే ఏపీ మరో శ్రీలంక అవుతుందని అసత్య ప్రచారాలు చేసిన బాబు, సూపర్ 6 పేరుతో సంక్షేమ పథకాలు ఇస్తాననడం విడ్డూరంగా ఉందన్నారు. 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు, పార్లమెంటు అభ్యర్థి అయిన తనకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి బీసీలకు 50 శాతం పదవులు ఇస్తూ అత్యంత ప్రాధాన్యతనిచ్చారని, చిన్నవాడినైన తనకు పార్లమెంటు అభ్యర్థిగా అవకాశం కల్పించారని అన్నారు. ముఖ్యమంత్రికి ప్రజలలో వస్తున్న ఆదరణ చూసి ఒంటరిగా ఎదురుకోలేక బీజేపీ, జనసేనలతో టీడీపీ అనైతిక పొత్తు పెట్టుకుందని ఎంతమంది ఏకమైనా వైఎస్ఆర్ సీపీ విజయాన్ని అడ్డుకోలేరన్నారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ టీడీపీకి ఓటు వేస్తే ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో వినుకొండ నియోజకవర్గాన్ని గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేశామన్నారు. కారుమంచి గ్రామంలో జరిగిన అభివృద్ధితో పాటు మండలంలో జరిగిన అభివృద్ధిని గుర్తించి ప్రజలు ఆశీర్వదిస్తే రానున్న రోజులలో వినుకొండను రాష్ట్రంలోనే పేరున్న నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బేతంచర్ల-బుగ్గనపల్లి మధ్య రైల్వే లైను ప్రారంభం

- అందుబాటులోకి గుంతకల్లు-బుగ్గనపల్లి మధ్య 113 కిలోమీటర్ల డబుల్ లైను
- వివరాలు వెల్లడించిన డీఆర్ఎం రామకృష్ణ





విద్యుదీకరణతో రూపుదిద్దుకున్న గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ లైను

లక్ష్మీపురం: ప్రస్తుతం కొనసాగుతున్న గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ ప్రాజెక్టుపై దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులను వేగవంతం చేసినట్లు గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్ఎం రామకృష్ణ తెలిపారు. స్థానిక పట్టాభిపురంలో గుంటూరు డివిజినల్ మేనేజర్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని బేతంచెర్ల-బుగ్గనపల్లి సిమెంట్ నగర్ మధ్య మరో 6.2 కిలోమీటర్ల మేర సెక్షన్ విద్యుదీకరణతో పాటు డబుల్ లైన్ పనులు పూర్తి చేసి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ విభాగం ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్, నంద్యాల జిల్లాల్లోకి వస్తుందని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఈ సెక్షన్‌ను డబ్లింగ్ చేయడంతో గుంతకల్లు-బుగ్గనపల్లి మధ్య 113 కిలోమీటర్ల వరకు విద్యుదీకరణతో పాటు నిరంతర డబుల్ లైన్ సౌకర్యం ఉంటుందని తెలిపారు. గుంటూరు-గుంతకల్లు సెక్షన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు నగరాన్ని రాయలసీమ ప్రాంతంతో అనుసంధానించే కీలకమైన రైలు మార్గమని వివరించారు. ఈ లైన్ గుంటూరు, ప్రకాశం, పల్నాడు, నంద్యాల, కర్నూలు జిల్లాలల్లోని మారుమూల ప్రాంతాలను కలుపుతుందని చెప్పారు. ఈ విభాగంలో రద్దీని తగ్గించడానికి గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ విద్యుదీకరణ ప్రాజెక్ట్ 2016లో సుమారు రూ.3,887 కోట్ల అంచనా వ్యయంతో 401 కిలోమీటర్ల దూరం కోసం మంజూరు చేయబడిందన్నారు. ఇప్పటి వరకు నల్లపాడు-గిద్దలూరు మధ్య 200 కిలోమీటర్ల మేర, బేతంచెర్ల-గుంతకల్లు మధ్య 107 కిలోమీటర్ల మేర డబ్లింగ్ విద్యుదీకరణతో మొత్తం 307 కిలోమీటర్ల ప్రాజెక్ట్ పూర్తయ్యి ప్రారంభించబడిందని ఆయన తెలిపారు. ఇప్పుడు బేతంచెర్ల-బుగ్గనపల్లి మధ్య మరో 6 కిలోమీటర్ల మేర పనులు పూర్తి కావడంతో గుంటూరు-గుంతకల్లులోని వివిధ విభాగాలలో మొత్తం 313 కిలోమీటర్ల మేర రెండవ లైన్‌తో పాటు విద్యుదీకరణ పూర్తి అయిందని తెలిపారు. ప్రధానంగా గుంటూరు-గిద్దలూరు మధ్య 200 కిలోమీటర్లు, బుగ్గనపల్లి-గుంతకల్లు మధ్య 113 కిలోమీటర్ల మేర నిరంతరాయంగా రైళ్లు నడపబడతాయని వివరించారు. ఈ విభాగాలను డబ్లింగ్ చేయడం వల్ల రద్దీ తగ్గుతుందని తెలియజేశారు. తద్వారా గుంటూరు-గుంతకల్లు సెక్షన్‌లో రైళ్ల నిర్వాహణలో వెసులుబాటు లభిస్తుందని పేర్కొన్నారు. ప్రాజెక్టులోని బుగ్గనపల్లి-గిద్దలూరు మధ్య పనులు శరవేగంగా జరుగుతున్నాయని, మొత్తం ప్రాజెక్ట్‌ను డబ్లింగ్, విద్యుదీకరణ పూర్తి చేయడం వల్ల సెక్షన్‌లో రద్దీ తగ్గడమే కాకుండా రైళ్ల సగటు వేగాన్ని పెంచడంలో సహాయపడుతుందని తెలిపారు. డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడిపించేందుకు సహకరించిన ఆయా డివిజన్ విభాగాధిపతులను ఆయన అభినందించారు.

'పుట్టపర్తి' సాహితీ సేవ శ్లాఘనీయం



పుట్టపర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న అసోసియేట్ డీన్ డాక్టర్ స్మిత్

బాపట్ల: తెలుగు భాషాభివృద్ధికి బహుభాషా కోవిదుడు, సాహితీవేత్త పుట్టపర్తి నారాయణాచార్యులు సేవలు శ్లాఘనీయమని బాపట్ల వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టరు డి.డి. స్మిత్ పేర్కొన్నారు. నారాయణాచార్యులు జయంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ మాట్లాడుతూ నారాయణాచార్యులు తన 12వ ఏటనే రచనల్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఒక ఎగ్జామ్ కి నారాయణాచార్యులు వెళ్లినప్పుడు ఆయన రాసిన కవిత్వమే ఆ పరీక్ష పేపర్లో వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జి.రవిబాబు, డాక్టర్ బి. జాన్ వెస్లీ, డాక్టర్ కె.వి.ఎస్. రామిరెడ్డి, డాక్టర్ జి. వీరప్రసాద్, డాక్టర్ కృపావతి, డాక్టర్ లావణ్య, డాక్టర్ ఎన్. అశోక్ కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికల వేళకు ఎగిరొచ్చేస్తారు!

- జిల్లాలో 252 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు
- మాచర్ల నియోజకవర్గంలో 52 మంది

సత్తెనపల్లి: పల్నాడులో ఫలితం ఎటు..? నరసరావుపేటలో నిలిచేది ఎవరు..? సత్తెనపల్లిలో సత్తా చాటేదెవరు..? గురజాలలో గెలుపు ఎవరిది..? చిలకలూరిపేటలో చిందేసేది ఎవరు..? పెదకూరపాడులో పెత్తనం ఎవరిది..? వినుకొండలో వాణి వినిపించేది ఎవరు..? మాచర్లలో మళ్లీ ఎలా ఉండబోతుంది..? సార్వత్రిక ఎన్నికల వేళ స్థానిక ఓటర్లలో ఆసక్తి సాధారణం. వివిధ దేశాలలో ఉన్నవారూ ఈ సమరంపై ఎక్కడా లేని ఆసక్తి చూపుతున్నారు. ఇక్కడి సంగతులు ఆన్‌లైన్, వాట్సాప్ కాల్‌లో మాట్లాడి తెలుసుకోవడానికి ఉత్సుకత చూపుతున్నారు. వారెవరో కాదండీ .. పల్నాడు జిల్లా నుంచి వివిధ ఉద్యోగాలు, ఉపాధి కోసం వెళ్లిన ఎన్ఆర్ఐలే. చాలా మంది ఎన్నికల సమయానికి స్వగ్రామాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే కొందరు పార్టీలపై అభిమానంతో వచ్చి ప్రచార వ్యూహాలకూ పదును పెడుతున్నారు.

ఓటర్లలో వీరు వేరయా..

పల్నాడు జిల్లాలో పెదకూరపాడు, చిలకలూరిపేట, నరసరావుపేట, సత్తెనపల్లి, వినుకొండ, గురజాల, మాచర్ల నియోజకవర్గాలు ఉన్నాయి. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 252 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు ఉన్నారు. ఎన్నికల సంఘం అధికారికంగా విడుదల చేసిన జాబితాలోని లెక్కలివి. అత్యధికంగా మాచర్ల నియోజకవర్గంలో 52 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు ఉంటే అత్యల్పంగా వినుకొండ నియోజకవర్గంలో 21 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు ఉన్నారు.

జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఎన్ఆర్ఐ ఓటర్లు...

నియోజకవర్గం	ఎన్ఆర్ఐ ఓటర్లు
పెదకూరపాడు	42
చిలకలూరిపేట	34
నరసరావుపేట	28
సత్తెనపల్లి	43
వినుకొండ	21
గురజాల	32
మాచర్ల	52
మొత్తం	252

విదేశాల్లో ఉన్నా ఓటు వినియోగం

విదేశాల్లో ఉంటున్నా భారతీయులు ఓటేయడానికి అర్హులే. అక్కడి పౌరసత్వం లేని భారతీయ పౌరుడు, పౌరురాలు 18 ఏళ్లు నిండితే చాలు పాస్‌పోర్ట్ లోని భారతదేశం చిరునామా వివరాలు పేర్కొనాలి. నమోదు చేసిన ప్రాంతంలోనే నేరుగా హాజరై ఓటు వేయాలి. ఓటు కోసం ఫారం-6 దరఖాస్తు చేసుకోవచ్చు. నేరుగా ఈఆర్వోకు ఇవ్వవచ్చు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో పేర్కొన్న ఈఆర్వో చిరునామాకు పోస్టులోనూ పంపొచ్చు. పోస్టు ద్వారా పంపేవారు పాస్‌పోర్ట్ లోపల పేజీ ఫోటో, వ్యక్తిగత వివరాలు ఉన్న పేజీని ఫోటో తీసి చెల్లుబాటు అయ్యే వీసా వివరాలు జత చేసి పంపాలి. ఈ పత్రాలన్నీ మనదేశ అధీకృత అధికారి ధృవీకరించాలి. ఈఆర్వోకి వ్యక్తిగతంగా దరఖాస్తు ఇవ్వాలనుకుంటే ఒరిజినల్ పాస్‌పోర్ట్ సమర్పిస్తే పరిశీలన పూర్తయ్యాక ఇచ్చేస్తారు. పోలింగ్ రోజున ఇదే పాస్‌పోర్ట్ చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు.

విలువైన రికార్డులు అపహరణ



కార్యాలయాన్ని పరిశీలిస్తున్న సీఐ లోక్‌నాథం

నగరంపాలెం: రాష్ట్ర యూనియన్ కార్యాలయంలో రికార్డులు, వస్తువుల అపహరణపై గుంటూరు యూనిట్ అధ్యక్షుడు కోటేశ్వరరావు బుధవారం రాత్రి నగరంపాలెం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. మెడికల్ కాలేజీ ఉమెన్స్ హాస్టల్ రోడ్‌లోని ఉమెన్స్ హాస్టల్ ఎదురుగా గుంటూరు ఎన్ఎస్పీ క్యాంప్ కాలనీలో క్వార్టర్ నంబర్ ఎఈ2లో ఏపీ ఇరిగేషన్, రోడ్స్/ బిల్డింగ్స్, పబ్లిక్ హెల్త్, పంచాయతీరాజ్/ మున్సిపల్ ఎంప్లాయిస్ స్టేట్ అసోసియేషన్ కార్యాలయం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గుంటూరు యూనిట్ అధ్యక్షుడు కోటేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి నాగేశ్వరరావు బుధవారం ఉదయం 9 గంటల సమయంలో రాష్ట్ర కార్యాలయం వద్దకెళ్లారు. ముందు, వెనుక భాగంలో ఉన్న కిటికీలు, గదుల తలుపులను పగులకొట్టినట్లు గుర్తించారు. అనంతరం లోనికెళ్లి నిశితంగా పరిశీలించగా, అందులో విలువైన రికార్డులు, వస్తువులు అపహరణకు గురైనట్లు గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా లోనికి చొరబడి వాటిని ఎత్తుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు నగరంపాలెం పీఎస్ సీఐ లోక్‌నాథం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

వాగులో పడి 30 గొర్రెలు మృతి



చనిపోయిన గొర్రెల వద్ద కాపలాదారులు

మేడికొండూరు: వాగులో పడి రూ. 10 లక్షల విలువైన గొర్రెలు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని విశదల గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం ..విశదల గ్రామానికి మున్నపాటి గోపి, మర్రి ఆదినారాయణ, కొక్కెర నరేష్‌లు గొర్రెలు కాచుకుంటూ జీవనం సాగిస్తుంటారు. గురువారం రాత్రి గ్రామ శివారులో రోజు మాదిరిగానే ఉదయం గొర్రెలు కాచుకుని తిరిగి వస్తూ వాగు దాటుతున్న సమయంలో ప్రమాదవశాత్తులో లోతులోకి వెళ్లి గొర్రెలు మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. వాటి విలువ రూ. 10 లక్షలు ఉంటుందని వాపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరారు.

పీజీ విద్యార్థికి తీవ్రగాయాలు

యడ్లపాడు: ముందు వాహనాన్ని తప్పించే క్రమంలో కారు ప్రమాదానికి గురై మంగళగిరి ఎన్నారై మెడికల్ కళాశాల పీజీ ద్వితీయ సంవత్సరం వైద్య విద్యార్థికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా బ్యాంకు కాలనీకి చెందిన మద్దినేని పవన్‌కృష్ణ మంగళగిరి ఎన్నారై మెడికల్ కళాశాలలో జనరల్ మెడిసిన్ విభాగంలో ద్వితీయ సంవత్సరం పీజీ చేస్తున్నాడు. గురువారం తిరుపతి నుంచి ఎన్నారైకు కారు డ్రైవ్ చేస్తూ వస్తున్న సమయంలో యడ్లపాడు మండలం తిమ్మాపురం పరిధిలోని వసంత నూలు మిల్లు ఎదురుగా హెవీ లోడు లారీని తప్పించే క్రమంలో అదుపు తప్పిన కారు లారీ వెనుక భాగాన్ని ఢీకొన్నాడు. ఎయిర్ బ్యాగులు ఓపెన్ అయినప్పటికీ కారులో ఉన్న పవన్ కృష్ణ తలకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని 108 వాహనంలో చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మంగళగిరి ఎన్నారైకు తరలించారు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న యడ్లపాడు ఎస్ఐ జె.శామ్యూల్ రాజీవ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు ఉమేష్‌చంద్ర జయంతి

తెనాలి రూరల్: దివంగత ఐపీఎస్ అధికారి చదలవాడ ఉమేష్ చంద్ర 58వ జయంతిని కుటుంబ సభ్యులు శుక్రవారం తెనాలిలో నిర్వహించనున్నారు. చెంచుపేటలోని ఉమేష్ చంద్ర విగ్రహం వద్ద ఉదయం తొమ్మిది గంటలకు జరుగనున్న జయంతి కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ, సీనియర్ ఐపీఎస్ అధికారి ద్వారకా తిరుమలరావు, ఇతర అధికారులు పాల్గొంటారని కుటుంబ సభ్యులు గురువారం తెలిపారు.